


## శ్రీమతిగారి తుమ్ము

జోగారావుకి శకునాలంటే గొప్ప నమ్మకం. ఎక్కడికి బయలుదేరినా శకునం చూచి మరీ బయలుదేరతాడు. శీతారామయ్య నూరురూపాయిలు బాకీ. ఎన్నిసార్లడిగినా ఇవ్వలేదు. ఆశ వదిలేసుకొన్నాడు. ఉన్నట్లుండి మావాడి కారోజున శీతారామయ్యదగ్గర కెళ్ళాలని బుద్ధి పుట్టింది. ఆసంగతి శ్రీమతితో చెప్పి మెట్లు దిగబోయాడు. ఆవిడ "హచ్" అని తుమ్మింది. మావాడు తలపట్టుకొని మెట్లపైని కూర్చుండిపోయి, కొంతసేపటికి బయలుదేరాడు. శీతారామయ్య మారు మాట్లాడకుండా డబ్బిచ్చేసాడు. ఆశ వదులుకొన్న బాకీ వసూలయినందుకు మావాడి ముఖం పున్నమి చంద్రుని ముఖంలా విప్పారింది. ఇకనుండి తుమ్ములను నమ్మకూడదని నిశ్చయించుకొన్నాడు.

ఇంటిముఖం పట్టాడు. దారిలో గారడీ జరుగుతుంది. అందరూ చూస్తున్నారు. తానుకూడా లోపలికెళ్ళాడు చూడడానికి. గారడీవాళ్ళు వింతలు చేస్తున్నారు. ఎవరికితోచినట్లు వాళ్ళు డబ్బులిస్తున్నారు. ఇచ్చిన బాబుకి ఒక సలాం ఇవ్వనికిబాబుకి రెండు సలాంలు అని హుషారుగా కేకలేస్తున్నాడు గారడీ సాయిబు. గారడీవాడికి డబ్బు లిద్దామని జేబులో చెయ్యిపెట్టాడు. పర్సు లేదు. వెంటనే "శ్రీమతిగారి తుమ్ము" జ్ఞాపకమొచ్చింది మావాడికి.

నాబాల రాజగోపాల్

## మోసపోయాను

మా Quarter లో ఒక బెడ్‌రూమ్‌లో నేను, ఇంకొకరూమ్‌లో కొత్తగా పెళ్ళిచేసుకున్న దంపతులు వుండేవారు. ఒకరాత్రి వాళ్ళేదో తాపత్రయం పడుతున్నట్లు వినిపించింది. మెల్లగా తలుపు దగ్గరకు వెళ్ళి విన్నాను. తలుపులు వేయబడివున్నాయి. లోపలనుంచి ఏవో గుసగుసలు. "మీ రెక్కండి" అనే అడస్వరం మొదట వినిపించింది. కొంత సేపటికి గాజుల గలగల ఖర్‌ఖర్ అనే శబ్దం. 5 నిమిషాలు పోయింతరువాత "నువ్వెక్కు" అన్న మొగకంఠం వినిపించింది. మళ్లీ గాజుల గలగల, ఖర్‌ఖర్ చప్పుడు. ఇంకొక 5 నిమిషాలు పోయింతరువాత "ఊహుం! ఇద్దరం ఎక్కాలి" అనే ఆడకంఠం వినిపించింది

"మొదటిసారి, రెండవసారి జరిగే పనులు సంభవం, కాని మూడవసారి యిద్దరు ఎలా ఎక్కుతారు?" అని భావించి ఆశ్చర్యపడి నా మంచం నిలబెట్టి వెంటిలేటర్‌గుండా లోపలకు చూచాను. ఏముంది నా ఆశలన్నీ నిరాశలైపోయాయి.

బట్టలతో ఉక్కిరిబిక్కిరిలాడే ఒక పెద్దపెట్టిని మూయటానికి ఆ దంపతులు ప్రయత్నిస్తున్నారు. అందుకే యెవరో వకరు పెట్టిమీద ఎక్కి అణిస్తే, ఇంకొకరు పెట్టి గొళ్లెం వేయాలని అనుకున్నారు. కాని, ఆ పెట్టి బట్టలతో బాగా నిండియున్నది కాబట్టి ఒకరిచేత కాలేదు, అందుకు "ఇద్దరూ ఎక్కాలి" అంది ఆ ఆడకంఠం. ఈ సంఘటన చూచి నేను మోసపోయానని సిగ్గుపడ్డాను.

సత్యానంద్ పండా.

## జగన్నాటకం!

మా పొరుగునుంటున్న మామ్మగారు మామూలుగా వీధరుగుమీద బల్లమీద కూర్చున్నారు. ఇంతలో ఒక సాధువు "జై సద్గురూ!" అంటూ ప్రవేశించాడు.

"జైసద్గురూ! జాతకం చూస్తాం" అంటూ బల్లమీద తిష్ఠవేసి ఆవిడచెయ్యి చూసి "మీరిప్పుడో రోగంతో బాధపడుతున్నారు. అది నయమగుట లేదు అవునా?" అడిగా డావిడ మొహంలోకి చూస్తూ.

ఆవిడ జబ్బుగా ఉన్నమాట నిజమే! అంచేతేగా ఆవిడ రోజూ రిక్షాలో డాక్టరుగారింటికి వెళ్తారట! ఇంతవరకూ నయమవనిమాటా నిజమే!

ఆశ్చర్యపోతూ "అవును స్వామీ!" అంది.

"జై సద్గురూ మీకు పిల్లలులేరు భర్త లేరు. ఆడపిల్లను దత్తుచేసికొన్నారు. సద్గురు వచనం జరిగెను ఖచ్చితం" అంటూ ఇంకా ఎన్నో చెప్పాడు.

ఆ యింట్లో అద్దెకుంటోన్న ఆడవాళ్లు కూడా సాధువు ప్రజ్ఞకి ఆశ్చర్యపోయి తమచేతులు కూడా చూపించుకొని, శాంతులకి, చూసినందుకు వగైరాలకు సుమారు అయిదు శేర్ల బియ్యం, పది రూపాయలూ కొంత చిల్లరా సమర్పించారు. పిల్లికి బిచ్చమెయ్యని మామ్మగారు జబ్బునయంచేసేమందు తయారుచేస్తానంటే అయిదు రూపాయలు సమర్పించారు!